క్లుప్తంగా

క్రీడలతో క్రమశిక్షణ


బెల్టులు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ కలిగిన పౌరులుగా రాణించాలంటే క్రీడల వల్లే సాధ్యమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ ఆత్మరక్షణ కోసం తైక్వాండో లాంటి క్రీడలు అవసరమన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. అనంతరం బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు కలర్ బెల్టులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

రచనలతో సమాజాన్ని జాగృతం చేయాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సమాజాన్ని జాగృతం చేసేలా రచనలు ఉండాలని పలువురు సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం కర్నూలులోని మద్దూర్ నగర్ తెలుగు తోటలో ప్రముఖ కథా రచయిత జి.ఉమామహేశ్వర్ రచించిన 'నెమలీకలు - నెమరువేతలు' (శ్రీశైలం ప్రాజెక్టు హైస్కూల్ కథలు) పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ విలువలు తెలియజేసేలా ఈ పుస్తకం ఉందన్నారు. కథలు సమాజానికి విలువలు బోధిస్తాయన్నారు. బాల సాహిత్య రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీశైలం ప్రాజెక్టు పూర్వ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయితలు ఎంఎస్‌డీ ఇనాయతుల్లా, తెలకపల్లి మధుసూదనశర్మలు పుస్తక సమీక్ష చేశారు.

శ్రీనివాసనాయక్ మృతిపై విచారణ జరిపించండి


మాట్లాడుతున్న కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): అనంతపురం జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసనాయక్ మృతిపై విచారణ జరిపించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కై లాస్‌నాయక్ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసనాయక్ కుటుంబ సభ్యుల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. ఒత్తిళ్లు, బెదిరింపులను తట్టుకోలేక అనేక మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అనేక మంది బయటకు చెప్పుకోలేక తమలో తామే బాధలను దిగమింగుకొని ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు కేతావత్ లక్ష్మణ్‌నాయక్, ఉద్యోగ సంఘం నాయకులు నేనావత్ రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన పెంచుకోండి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ఇన్‌పుట్ డీలర్లు వ్యవసాయ చట్టాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమా కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై క్విజ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకునేందుకు దేశీ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డీలర్లు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జేడీఏ, దేశీ సమన్వయకర్త జయచంద్ర, జిల్లా వనరుల కేంద్రం ఏవో శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ గౌరవాధ్యక్షురాలు నిర్మలమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ డిమాండ్ చేశారు. డిసెంబర్ 8న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తి.. రాజ్యాంగ దీప్తి


బహుమతి అందిస్తున్న ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్



ఎదురూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిజ్ఞ

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్‌లో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ జీ రంగలక్ష్మిదేవి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సుబ్బయ్య, సాతర్ల రాజేష్, న్యాయవాదులు ప్రభాకర్, జగదీష్, భరత్‌రెడ్డి, శ్యాంసన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో దేశ పురోగతి

భారత రాజ్యాంగ స్ఫూర్తితోనే దేశం పురోగతి చెందుతోందని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ ఎస్ సంజీవ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో 74వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీవీఎంసీ సభ్యులు కాకర్ల శాంతికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగానే నేడు దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, వసతి గృహంలో ఏర్పాటు చేసిన మినీ లైబ్రరీని ప్రారంభించారు. రాజ్యాంగ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మద్దిలేటి, వసతి గృహ సంక్షేమాధికారిణులు బెన్నమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగమని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన నగరంలోని పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ మద్దయ్య, కేదార్‌నాథ్, రైల్వే ప్రసాద్, ప్రభుదాస్, చాట్ల నవీన్, మహేష్, శ్రీరాములు, పర్ల సూరీడు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం

కర్నూల(రాజ్‌విహార్): భారత రాజ్యాంగాన్ని స్ఫూర్తిని కొనసాగిద్దామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక బిర్లా గేట్ ఆవరణలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ ఆశయాల సాధన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలకు అన్ని నామినేటెడ్ పదవులు ఇచ్చిన గుర్తింపు తెచ్చారని కొనియాడారు. పార్టీ రాష్ట్ర నాయకులు సీహెచ్ మద్దయ్య, నాయకులు ధనుంజయ ఆచారి, కేదార్‌నాథ్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): డా.బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. కర్నూలు పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు కల్చరల్: గ్రంథాలయ సంస్థలో సంస్థ అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించి, భారత రాజ్యంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ హక్కులు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఎదురూరు గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు ఆదివారం కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, రేమట ఎస్.సంపత్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛా స్వాతంత్య్రాలకు మూలం రాజ్యాంగం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజల స్వేచ్ఛా స్వాతంత్య్రాలకు మూలం రాజ్యాంగమేనని.. రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లనే స్వేచ్ఛగా ఉండగలుగుతున్నామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండులో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన ఖగోళ శాస్త్రవేత్త కృష్ణస్వామి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషాద్రిరెడ్డి, కార్యదర్శులు బాషా, మద్దిలేటి

భారత సంవిధాన దినోత్సవ వేడుకలు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం భారత సంవిధాన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ శివరాముడు కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సహేరా బాను, ఏఎస్ఓ శివ, సీనియర్ అసిస్టెంట్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుభాష్ చంద్రబోస్

● హక్కులకు రక్షణ కవచం రాజ్యాంగం


మున్సిపల్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : ప్రజల హక్కులకు రక్షణ కవచం మన రాజ్యాంగం అని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. ఆదివారం స్థానిక నగరపాలక కౌన్సిల్‌హాలులో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ కచిన్నరాముడు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, డెమో ప్రమీలాదేవి, ఎస్ఓ హేమసుందరం, డీపీఓ విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సాంఘిక సంక్షేమ కార్యాలయంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేడీ రంగలక్ష్మిదేవి


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌డీఓ హరిప్రసాదు


విద్యుత్ శాఖ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

గొప్ప దార్శనికుడు బాబా సాహెబ్

కల్లూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం 74వ రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా కల్లూరు అర్బన్ 33వ వార్డులోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కాటసాని, ఎస్సీ విభాగం నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మంత్రి వర్గంలో 75శాతం బడుగు, బలహీన వర్గాలకు, నామినేటెడ్ పదవుల్లో 50శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం పదవులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరు అర్బన్ జేసీఎస్ హనుమంతురెడ్డి, నంద్యాల పార్లమెంటరీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి శివ, మిద్దూరు శ్రీనివాసులు, శివశంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి

కర్నూలు(సెంట్రల్) : రాజ్యాంగ స్ఫూర్తిని నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆర్‌డీఓ హరిప్రసాదు అన్నారు. ఆదివారం ఆర్‌డీఓ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు

కర్నూల(రాజ్‌విహార్):భారత రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని విద్యుత్ శాఖ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ భవన్, ట్రాన్స్‌కో కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్, బీసీ విద్యుత్ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బెళగల్ ఉసేని, జిల్లా అధ్యక్ష, కార్యర్శులు పెద్దయ్య, నాగశేషులు పాల్గొన్నారు.


కల్లూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు సిటీ: మైపర్ కాలేజీలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డా.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.సురేష్ పాల్గొన్నారు.

- బిక్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ రంగస్వామి నాయక్ పాల్గొన్నారు.
- ఎన్ఆర్ పేటలోని భాష్యం స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీ.జీ వెంకటేష్, జోనల్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్స్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవీ-ఇవీ

ఉపాధ్యాయులకు మెమోలు ఇవ్వడం తగదు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులు ఏ తప్పూ చేయకపోయినా విద్యాశాఖ అధికారులు మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేయడం తగదని అప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు అన్నారు. ఆదివారం అప్టా రాష్ట్ర కార్యవర్గ గుగూల్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క రోజే సుమారు 262 మంది ఉపాధ్యాయులకు చార్జ్ మోమెలు, షోకాజ్ నోటీలులు ఇవ్వడం ఆందోళనకు గురి చేస్తోందన్నారు. దీనిపై పోరాటాలకు సిద్ధం అవుతున్నామని చెప్పారు. అధికారులు స్పందించి మోమెలను, నోటిసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

15 నుంచి రైతు సంఘం జాతీయ సమావేశాలు

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 16,16,17 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మల, డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఒకటో జోన్ సర్వసభ్య సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి అమలు చేయలేకపోయిందన్నారు. కేవీ నారాయణ, రాజగోపా,సుంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

10న కాంట్రాక్ట్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు

కర్నూలు(సెంట్రల్) : డిసెంబర్ 10వ తేదీన విజయవాడలో నిర్వహించే కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలులోని రెవెన్యూ భవన్‌లో రాష్ట్ర స్థాయి మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి, నాయకులు వై.కృష్ణ, దాసన్న, ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ లష్కర్ మృతి

కర్నూలు సిటీ: తుంగభద్ర దిగువ కాలువ కోడుమూరు సబ్ డివిజన్‌లో లష్కర్‌గా ఉంటూ జలవనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న మిద్దె పెద్దరాముడు ఆదివారం తెల్లవారుజామున తన స్వగ్రామమైన ప్రాతకోటలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఈ ఆఫీస్ సూపరింటెండెంట్ కమలాకర్, స్టెనో వెంకటేశ్వర్లు, లష్కర్ల సంఘం నాయకులు గ్రామానికి వెళ్లి భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆఫీస్ తరుపున కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని లస్కర్ల సంఘం అధ్యక్షులు నాగన్న కోరారు.

నేడు సంగీత నీరాజనం

కర్నూలు కల్చరల్: టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సోమవారం సాయంత్రం 4 గంటల సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి విజయ ఆదివారం తెలిపారు. విజయవాడలో డిసెంబర్ 10 నుంచి 12 తేదీ వరకు జరగబోవు కృష్ణ వేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్‌కు ముందస్తు కార్యక్రమాలుగా సంగీత నీరాజనాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆరు విశిష్ట ప్రదేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారని చెప్పారు.

హాస్యం మనిషికి టానిక్ లాంటిది

కర్నూలు కల్చరల్: హాస్యం మనిషికి టానిక్‌లా పనిచేస్తుందని కళాకారులు, విశ్రాంత కలెక్టర్ జి.బలరామయ్య అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో 'ఏడనున్నాడు ఎక్కడున్నాడు' హాస్య నాటిక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా బలరామయ్య నాటక దర్శకులు షఫీని సత్కరిస్తూ కళాక్షేత్రం తరపున రూ.20 వేలు నగదు పారితోషికం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాంఘిక నాటకాలు సమాజానికి దర్పణం లాంటివి అన్నారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రతి నెల చివరి ఆదివారం సాంఘిక నాటకం ఉంటుందని చెప్పారు. అంతకు ముందు లలితా కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.వి.చలపతి రావు చిత్రపటానికి పుష్పమాల సమర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. చిలకలూరిపేట అమ్మేచూర్ డ్రమెటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నాటక ప్రదర్శనలో మాధవి, హరిబాబు, శివరాం, ప్రసాద్, నారాయణరావు, షఫీల నటన ప్రేక్షకులను కడుపుబ్బనవ్వించింది. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ మియా, ఉపాధ్యక్షులు ఇనాయతుల్లా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


కళాకారులతో విశ్రాంత కలెక్టర్ బలరామయ్య, కళాక్షేత్రం సభ్యులు


తుంగా హారతి ఇస్తున్న పురోహితులు


జ్వాలాతోరణం వెలిగిస్తున్న దృశ్యం


రథంపై కొలువైన శివపార్వతుల విగ్రహాలు

కార్తీక దీపం.. దివ్య తేజం

- కార్తీ పౌర్ణమిని పురస్కరించుకొని లక్ష దీపోత్సవం
- వినాయక్ ఘాట్‌లో కనుల పండువగా వేడుక

కర్నూలు కల్చరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం వినాయక్ ఘాట్‌లో లక్ష దీపోత్సవ వేడుక కనుల పండువలా నిర్వహించారు. శివకేశవులకు ప్రీతి పాత్రమైన ఈ మాసంలో కార్తీక పౌర్ణమి అత్యంత పవిత్రం కావడంతో భక్తులు వేలాదిగా వినాయక్ ఘాట్‌కు చేరుకొని భక్తి పారవశ్యంతో దీపాలను వెలిగించి కేసీ కెనాల్‌లో వదలి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా వేడుక జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేసే ఇలాంటి వేడుకలను నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు అందరూ ఒక వేదిక దగ్గర సామూహికంగా కార్తీక దీపాలను గంగమ్మ ఒడిలోకి వదలడం నూతనోత్తేజం కలుగుతుందన్నారు.


వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం..

సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి నుంచి వినాయక్ ఘాట్ వరకు రథంపై శివపార్వతులను ఊరేగించారు. జ్యోతి ప్రజ్వలన, ఆకాశ దీప ప్రజ్వలనతో దీపోత్సవాన్ని ప్రారంభించారు. ప్రధాన వేదికపై శివ పార్వతులకు అభిషేకం చేశారు. నాగఫణి శాస్త్రి బృందంచే శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన తుంగా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శివపార్వతుల కల్యాణం, కార్తీక పౌర్ణమిని విశిష్టతపై చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద ప్రసంగించారు. కార్తీక దీపోత్సవ సమితి కార్యాధ్యక్షులు పద్మావతి మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కేడీసీసీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, సమితి గౌరవాధ్యక్షురాలు టీజీ రాజ్యలక్ష్మి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శమంతకమణి, కల్కి దాసాజీ పూజల్లో పాల్గొన్నారు. కల్కి సేవా సమితి వారు దీప దానం చేశారు. కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, గడ్డం రామకృష్ణల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.


ఆలయాల్లో విశేష పూజలు..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు ఓల్డ్ సిటీలోని శ్రీలలిత పీఠంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ వ్రతం విశిష్టతను గురించి వివరించారు. సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జ్వాలా తోరణంలో మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, బ్రాహ్మణ సంఘం నాయకులు మనోహర్, రాజశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

- ఆదివారం ఉదయం ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అధికారులతో కలిసి వినాయక్ ఘాట్‌ను సందర్శించి కార్తీక దీపోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.


వినాయక ఘాట్‌లో నృత్యం చేస్తున్న కళాకారిణులు


తుంగా హారతిని తిలకిస్తున్న కలెక్టర్ సృజన


వినాయక ఘాట్‌లో ఏర్పాటు చేసిన శివలింగాలు